# శుభలేఖ

## ఏ. వి. ఎల్. నరసింహారావు

కాఫీ సేవిస్తూ పేపరు తిరగేస్తున్న శ్రీరామమూర్తిగారికి పోస్టుమేన్ ఒక శుభలేఖ అందించి వెళ్ళాడు.

"స్వస్తిశ్రీ చాంద్రమాన వైశాఖ శుద్ధ పంచమీ బుధవారం ఉదయం 9 గం. 20 ని. లకు నా జ్యేష్ఠపుత్రిక చి॥ సౌ॥ సుశీలను, కాకినాడ కాపురస్థులు మహారాజశ్రీ రాజయోగ్యులైన శ్రీరామమూర్తి బావగారి జ్యేష్ఠపుత్రుడు చి॥ రఘునాథరావు బి. ఏ., కిచ్చి రామచంద్రపురం తాలూకా పెద్దాడ గ్రామంలో మా స్వగృహమందు వివాహము జరిపించుటకు పెద్దలు నిశ్చయించినారు గాన, తామెల్లరు బంధుమిత్ర సమేతముగా విచ్చేసి వధూవరుల నాశీర్వదించి మదర్పిత చందన తాంబూలాదులం గైకొని మమ్మానందింప జేయగోరుచున్నాను. ఇవియే అనేక శుభలేఖార్థములు.

మంగళమహత్ ఇట్లు విధేయుడు,
శ్రీ శ్రీ శ్రీ సౌభాగ్య సుందర
రామయ్య.

సౌభాగ్య వెంకట్రావు, కె. యస్. మూర్తి 5th B com (Hons) మొదలగు వారి అభినందనములతో."

"ఓహో ఆచారప్రకారం మనకూడా ఒక లేఖ పంపించారన్నమాట వియ్యంకుడు గారు" అని ఆ శుభలేఖను అటూ ఇటూ తిరగేసూ అభినందనముల దగ్గరకొచ్చి "ఎవరీ మూర్తి?" అనుకున్నారు శ్రీరామమూర్తి గారు. తన వియ్యంకుడు గారికి పెద్ద చదువు చదువుతున్న పిల్లలెవరూ లేరే! పోనీ వియ్యంకుడన్నగారి తాలూకెవరయినా అనుకుంటే ఆయనకంతా ఆడపిల్లలే. పోనీ ఆ వూళ్ళో ఎవరిపేరైనా వేశారేమో అనుకుందామంటే ఆ వూళ్ళో మచ్చుకు స్కూల్ ఫైనల్ ప్యాసయిన కుర్రాడు ఒక్కడూ లేడు. ఈ విధంగా చేతిలోని శుభలేఖతో కుస్తీ పడుతున్న తండ్రిబాధ గమనించి రఘు ఊరుకోలేకపోయాడు.

"ఏమిటి నాన్నా చాల తాపత్రయపడుతున్నారు. ఏముంది అందులో?"

"అబ్బే ఏం లేదురా. నీ పెళ్ళి శుభలేఖ. ఇలా చూడు ఇక్కడ కె. యస్. మూర్తి 5th B com (Hons) మొదలగువారి అభినందనములతో అని వుంది. ఈ మూర్తెవరో నీకేమైనా తెలుసా?"

"ఏమోనండి, వాళ్ళ బంధుమిత్ర పరివారం సంగతి నాకేం తెలుసు."

"ఏమేవ్ శాంతా ఇలా రా. ఇదుగో, ఈ మూర్తి ఎవరో నీకేమైనా తెలుసా? ఆనర్స్ చదువుతున్నాడట"

తల్లి శాంతతోపాటు రేఖకూడ పరుగెత్తుకుంటూ వచ్చింది, "ఓహో ఏదేది. అన్నయ్య పెళ్లి శుభలేఖ అప్పుడే వచ్చేసినట్లుందే!" అంటూ.

"ఏమండీ, మీరు పెళ్లి మాటలకు వెళ్ళినప్పుడు వాళ్లతరపు అబ్బాయిలు ఎవరైనా ఉన్నారేమో, కనుక్కోలేకపోయారా? మీకు అసలు శ్రద్ధేలేదు. రెండు సంవత్సరముల నించి ప్రయత్నం చేస్తున్నారు గాని ఏమీ స్థిరపరచలేకపోయేరు. ఈ మూర్తి ఎవరో కొంచెం ముందుగా వాకబుచేస్తే మన కేమయినా కొంచెం పనికొచ్చేవాడేమో", అంది శాంతమ్మ.

రేఖ శుభలేఖను జాగ్రత్తగా పరిశీలిస్తూ "మూర్తి" దగ్గరకువచ్చి ఆగింది. ఒకవేళ తన క్లాస్‌మేట్ మూర్తేమో. అన్నటు ఎస్. ఎస్. ఎల్. సి. లో ఒకమూర్తి వుండేవాడు. వెనకాలే వచ్చి ఏమీ తెలియనట్లు తన జడపట్టుకు లాగి ఏడిపించేవాడు. ఆ మూర్తా? నా పిచ్చిగాని వాళ్లకి వీళ్లకి సంబంధమేమిటి!"

ఈవిధంగా ఒకర్నిమించి ఒకరు దీర్ఘంగా ఆలోచిస్తున్న సమయంలో "పోనీలెండి నాన్నగారూ! అతన్ని గురించి ఎందుకంత తర్జనభర్జనలు. పెళ్ళిలో అన్నీ తెలుస్తాయిగా!' అన్నాడు రఘు.

"అవునులేరా, నీకేం బాధ, మాకుగాని. అసలు రేఖకు నీకంటేముందు కానిచ్చేద్దామనుకున్నాను" అన్నాడు తండ్రి.

"సరేలెండి నాన్నా, యిప్పుడు నాకేమీ పెళ్లక్కర్లేదు." అని రేఖ విసురుగా లోపలకు వెళ్లిపోయింది.

స్కూలుఫైనలు ప్యాసవగానే, ఇంటరులో జాయిన్ చేశారు రేఖను. కాని పద్దెనిమిదేండ్లు వచ్చాక ఇంకా చదువేమిటని సగంలోనే మానిపించేశారు. రేఖ పైకి చలాకీగా కన్పించినా ఆమెకు తెలియని అమాయకత్వం ఆమెలో గోచరిస్తుంది. వయస్సుకు తగిన అందం ఆమెలో లేకపోలేదు. అసలు ఆడపిల్లలదగ్గర ఒక వ్యక్తిని అనుకొని పెళ్లిమాట తెచ్చేరో, ఇంక వాళ్లకు అదే ఆలోచన.

"మూర్తి, పేరు బాగుంది. చదువుకూడ పెద్దదే.-అసలు యిప్పుడు పెళ్లి చేసుకొనే ఉద్దేశం ఉందో లేదో అయినా అన్నయ్య పెళ్లిలో అన్నీ తెలుస్తాయిగా. బహుశా నాన్నగారు యీ సంబంధం మాట్లాడతారేమో" అని, మూర్తియొక్క మూర్తికి ఒక ఆకారం యేర్పరిచేసుకొంది రేఖ

* * *

పెళ్లివారిల్లు కిటకిటలాడుతోంది. సుందరరామయ్యగారు ఆ వూరు పంచాయతీబోర్డు ప్రసిడెంటు. చుట్టాలు, స్నేహితులు, నౌకరు, చాకర్లతో యిల్లంతా సందడిగా ఉంది.

"లేవండ్రా, పెళ్లివారు పొలిమేర కొచ్చేరు. ఏమండీ బ్రహ్మగారు, ఎదురు సన్నాహానికి అంతా రెడీయేనా? కొంచెం త్వరగా లేవండి ఒరే నారాయణా, చిట్టీ, ఏహోయ్ మూర్తీ, నువ్వుకూడా రావాలి."

మూర్తి "ఆ నేనెందుకు లెద్దురూ, వద్దాడిని" అన్నాడు.

"బాగుందోయ్ నువ్వు లేకుండానే" అన్నారు సుందరరామయ్యగారు.

ఎదురు సన్నాహం జోరుగా సాగింది. "ఇదుగో మూర్తీ, నువ్వు మరోలా భావించనంటే చెపుతాను. వీరిని విడిదికి తీసుకెళ్లి ఏం కావాలో కొంచెం చూసిరా, నాయనా."

## ★ శుభలేఖ ★

మూర్తికి కొంచెం చురుకుపాలు యెక్కువ. అందులోనూ మనిషంత మనిషి తనని ఆ విధంగా పురమాయించడంచేత మూర్తి కాదనలేక, మగపెళ్లి వారిని తీసుకొని విడిదికి బయలుదేరేడు.

“మూర్తీ వీరిని కొంచెం విడిదికి తీసుకెళ్లవోయ్” - అన్న మాటలు శ్రీరామమూర్తిగారు, పెళ్లికొడుకు, రేఖకూడ విన్నారు. “ఓహో ఇతనే కాబోలు మూర్తి. ఇదివరకెప్పుడూ చూసినట్టులేదు వయస్సు ఇరవై, ఇరవై రెండు మధ్య ఉండొచ్చు. ఏమే, మన రేఖను యీడూ, జోడూను ఏమంటావురా రఘూ?” అని శ్రీరామమూర్తిగారు గుసగుసలాడారు భార్యా పుత్రులతో.

తండ్రి, అన్నగారు మాట్లాడుకొనే ప్రతీ మాట చాలా జాగ్రత్తగా వింటోంది రేఖ విడిదిలో ఏలాగైనా మూర్తిని పలకరించాలని సరదా! “ఏమండోయ్ మూర్తిగారూ మా చుట్టాలలో చాలమందికి చంటిపిల్లలున్నారు. ఆవుపాలు కావాలి ఉదయమే పిల్లలందరూ తలలు అంటుకుంటారు కుంకుడుకాయలు, నూనె, నలుగుపిండి కావాలి తెల్లవారు ఝామున నాలుగు గంటలకు ఇద్దరు మనుష్యులు వేడినీళ్లు రెడీ చేయాలి. తెల్లవారుతూనే స్వాతికం,” అంటూ ఒక పెద్ద లిస్టు మొదలెట్టింది రేఖ.

“సరేనండి, మీ వియ్యంకుడుగారికి ఒక కాగితంమీద చిత్తా వ్రాసి యివ్వండి. అది నేను ఆయనకు అందచేస్తాను. నోటిని చెబితే కొన్ని మరచిపోవచ్చు. అయినా నేనేదో చుట్టం చూపుగా వచ్చినవాడిని నాకేం ముఖ్యం,” అని మూర్తి తన కొంటెతనాన్ని ప్రదర్శించాడు.

“శుభలేఖలో పేరు వేయించుకోడంలో అయిపోయిందనుకున్నారా? మామగారిలో సగం బాధ్యత మీమీద ఉంటుందని తెలియదేమో పాపం,” అని తడుముకోకుండా అంటించింది రేఖ.

“ఓహో, అదా మీ బాధ. మిమ్మల్ని విడిదిలోకి తీసుకురావడంతో నా సగం బాధ్యతా అయిపోయింది.”

శ్రీరామమూర్తిగారు, శాంతమ్మ వీళ్ల వాదనలు చూసి చిన్నవవ్వు నవ్వుకున్నారు. “అమ్మా, తెల్లప్రొద్దున్న నువ్వు యీ మూర్తిలాంటివాళ్ళని చేసుకుంటే యిలాగే తగవులాడుకుంటారేమిటే?”

“పో నాన్నా నువ్వుమరీను” అని రేఖ చిన్న సిగ్గు నభినయించింది. మూర్తి కొంచెం స్తంభించిపోయాడు. రామమూర్తిగారి మాటలలోని భావాన్ని గ్రహించాడు. కొంచెం తేరుకొని, “ఆఁ దానికేముంది లెండి, ఆ మూడుముళ్లు పడేవరకే. తరువాత అన్నీ సర్దు




కుంటాయి. అయినా భార్యా భర్తలమధ్య యిటువంటి ప్రణయకలహాలు సహజమేగా?"

మూర్తి విసిరిన చెణుకు రేఖను కొంచం చికాకులలో పెట్టింది.

తను అలా ఎందుకనాలి. అసలు నాన్నగారు మాత్రం మూర్తిలాంటివారిని అనడమేమిటి? నాన్నగారి మాటలలో భావాన్ని గ్రహించే అలా అన్నారేమో ఆయన. ఏమిటో యెందుకు నాకీయిచ్చి ఆలోచన," అనుకుందామె.

విడిదిలో ఉదయం స్నాతకం తతంగం చాలా హడావిడిగా జరుగుతోంది. పిలుపులకోసం వచ్చిన రేఖను చూసి మూర్తి ఒక్కసారి గట్టిగా నవ్వేడు. ప్రక్కనున్న స్నేహితుడికి ఏమీ అర్థం కాలేదు. "అంతకన్నా బరువైన చీరలింకేమీ లేవేమో కనుక్కోరా!" అన్నాడు మూర్తి.

రేఖ తనచీరకేసి ఒకసారి చూసికొని వెనక్కు చూసింది, తన్ను చూసి నవ్వుతున్న మూర్తివైపు. 'ఏదో పలెటూరు కదా అయినా స్నాతకం పిలుపులకు యింతకన్నా గొప్పచీర ఎందుకు?' అనుకుంది. కాని మూర్తి వెక్కిరింపు చివుక్కుమనిపించింది.

* * *

మాట తీసేయులేక డోలు, సన్నాయి తీసికొని భోజనం పిలుపులకు బయలుదేరేడు మూర్తి. "పోనీ లెండి ఒంటిగంటకైనా పిలుస్తున్నారు" అంది ఓగొంతు "డబ్బు అయిపోతుందనివంట బ్రాహ్మలను పెట్టకుండా వియ్యపురాలుగారే వండేసిందేమో వంటంతా" అంది మరో అమ్మలక్క. పని పూర్తి చేసికొని వెళుతున్న మూర్తిని చూసి తన మేనత్త కూతురుతో "అవునే బరువైన ఫేంటులు లేక తేలికైన లుంగీలు కట్టడం మాకు చేతగాదని చెప్పవే" అనేసి మూర్తిమీద వున్న అక్కసు కొస్తా తీర్చుకుంది రేఖ.

* * *

పట్టుబట్ట కట్టుకొని అన్నం బుట్ట తీసుకున్న మూర్తిని చూసి "అదేమిటోయ్? నువ్వుకూడా కూచో. ఏదో కుర్రాడివి కదా అని పిలుపులకు పంపాను అంతే. ఇప్పటికే పొద్దుపోయింది. ఇంక వడ్డనలోకి దిగితే మాపవుతుంది. అసలే మీ కాలేజీ కుర్రాళ్లకి పదిగంటలకు భోజనము అలవాటు కూడాను" అని వారించాడు సుందర రామయ్య.

మూర్తి "ఫరవాలేదండి ఒక డోస్ కాఫీ యిప్పుడే వేశాను. రేపొద్దున్న కాలేజీకిపోతే యీ సరదాలు ఎలా తీరతాయండీ" అన్నాడు. సాధ్యమైనంతవరకు మూర్తి ఆడవాళ్ల పంక్తిలోనే ఉండేవాడు. రేఖకు కూడా అతన్ని ఎలాగైనా ఏడిపిద్దామని సరదా.

"వంకాయ, అరటికాయ, వంకాయ అరటికాయ, మీకండీ" అని రెండు బుట్టలతో వచ్చాడు మూర్తి. రేఖ వద్దని చెయ్యూపింది. అలాగే అడుగుతూ వెడుతున్న మూర్తిని "ఏమండోయ్ తెచ్చినవి తెచ్చినట్లే పట్టుకుపోతే ఎల్లా అండి" అని పిలిచింది రేఖ.

"మీరే వద్దన్నారుగా యిందాక" అంటూ తిరిగి రేఖదగ్గరకు వచ్చాడు. "అవును మరి మీరు వంకాయ, అరటికాయి అంటుంటే, యిదేమిటి కాయలు, కాయలే పడేస్తున్నారు కాబోలు అని వదన్నాను," అన్నదామె.

"మరి యిప్పుడెందుకు పిల్చేరు"

"అవి ప్రక్కని వడ్డిస్తుంటే చూసి కాయలుకాదు. కూరలే అని తెలిసి పిల్చేను. అయినా ఒద్దులెండి వెళ్ళండి."

రెండు పంక్తుల ఆడాళ్లూ ఒక్కసారి ఫక్కున నవ్వారు. మూర్తి చిన్నబుచ్చుకు వెళ్ళాడు తిరువాత రసం గోకర్ణంతో వచ్చేడు మూర్తి. "ఏమండోయ్, రసం వేడిగా ఉంటే కావాలి, లేకపోతే అక్కర్లేదు" అని చెప్పింది రేఖ.

"కొంచం వెచ్చపెట్టి తీసుకొస్తానుండండి"

అని వెళ్ళిన మూర్తి ఆ రసం బాగామరగపెటి తీసుకొచ్చి రేఖ వద్దంటున్నా చెయ్యిమీదపోశాడు. చుర్రుమన్న చెయ్యి వెనక్కి తీసుకుంటూ "అబ్బా మరీ యింత వేడా" అని కసిరింది.

"ఏడిచారు మీరు కావాలన్నారుగా, కొంచెం గోరువెచ్చగా మరిగింది అంతే," అని నవ్వుతూ నిష్క్రమించేడు. ఆ రాత్రి శోభనం గది అంతా దేదీప్యమానంగా అలంకరించబడింది. వెండి పళ్లేలనిండా రకరకాల తినుబండారాలు. వెండిగ్లాసుతో పాలూ ఒక బల్లమీద; సెంటు, పన్నీరు, గంధం తమలపాకులు మొదలగు సామగ్రి మరో బల్లమీద అమర్చబడినాయి రేఖలాంటి కన్యలు తమకు కూడ యిలా జరగబోతుంది. కాబోలు అనుకుంటున్నారు.

"శోభనంపాట పాడండ్రా, ఒశేవ్, లీల, గిరిజ లత, అదేమిటే అంతా అలా సిగు పడతారు?" అంది ఒక పెద్ద ముత్తయిదువ.

"చాలా టైమైంది, హారతిచ్చి యివతలకు రండి!" సుందర రామయ్యగారి మాటలకు నవ్వుకుంటూ "అదేమిటిరా తమ్ముడూ ఇంక దంపతి తాంబూలాలైనా యిప్పించ

## పడికట్టు రాయి

"నమ్మినందుకు యిలా చేస్తావా? వీశెడు వెన్న తూచి పంపుతానని చెప్పి మూడేబులాలు ఇస్తావా? తప్పు కాదూ?"

"ఆ పాపం నీకే తెలియాల. ఇంటికాడ ఈసెరాయి మా బుల్లోడు యాడో పారేశాడు గందా అని, పొద్దుటేల నీ దుకాణంలోనే కొన్న ఈసెడు పంచదార పొట్లాంతోనే సరిక్కి సరిగా ఎన్న తూచి పంపా. నీపాపం నిన్నే కొట్టిందన్న మాట!"




# పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నదిన్నీ, నీ పరిపూర్ణ చర్య గురించిన్నీ నీవు తెలుసుకొన గోరినట్లయితే ఒక పోస్టు కార్డు పైన నీ కిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామా యున్నూ వెంటనే వ్రాసిపంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గణించి, నీవు కార్డు వ్రాసిన తేది లగాయతు 12 మాసములలోను నీ యొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయముకలుగును. నీ ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము. తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభం మొదలగువానిని గురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4 0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా వున్నయెడల శాంతిచేయు విధానం కూడా తెలుపుడు చేయడమగును వివరములు మా పూచీపైని పంపబడును. మేము పంపిన ఫోకటా నీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Shree Swami Satyanarain Jyotish Ashram (W. P. A.), NAKODAR (Pb.)

## ★ శుభలేఖ ★

లేదు. అప్పుడే పొమ్మంటావూ... ఇంక రేపటినుంచి నీ కూతురికి, నీ అల్లుడికి ఎవరూ అడ్డంపెట్టర్లే" అంది పెళ్లికూతురు మేనత్త వెంకూభాయమ్మ.

"ఏదమ్మా శీలా, యీ తాంబూలం కొరికి మీ ఆయనకియ్యి." అంది పెళ్ళికూతురు తల్లి.

"అదేమిటమ్మో, ఒదినగారూ! మా అబ్బాయి యిస్తాడులే, ఆ తమలపాకుల చిలక యిలాగ ఇయ్యి" అంది పెళ్లికొడుకు పినతల్లి.

అన్నయ్య ఎంగిలిచేసిన తమలపాకులు తినాలి కాబోలు వదిన. రేపొద్దున్న తను మూర్తిని చేసుకుంటే అతను కొరికి ఇచ్చిన కిళ్లీ తను తినాలి కాబోలు అనుకొని ప్రక్కన నిలబడ్డ మూర్తికేసి ఎవరూ చూడకుండా ఒక్కసారి చూసి ముసి ముసి నవ్వు నవ్వింది. మూర్తి తిరిగి ఆ నవ్వు నందుకున్నాడు.

"ఏదో ఆ తాంబూలాలూ యిప్పించి తలుపులు మూసేయ్యండమ్మా" అన్నారు బ్రహ్మగారు.

దంపత్తాంబూలాల పైముకు శోభనం గది కిట కిట లాడుతోంది. "ఈయన భార్య ఎవరో? ఆయన అర్ధాంగి ఎవరో అని తర్కించుకొనే ఆడవాళ్లకు, ఆ అమ్మాయి భర్త ఎవరో, ఆ తెల్లటావిడ మొగుడెవరో అని అంతవరకూ సందిగ్ధావస్థలోనున్న మొగవాళ్ళకు తమ తమ సందేహాలను తీర్చుకొనేందుకు అదే సమయం. ముందు తాంబూలం పెళ్ళికూతురుతల్లిదండ్రులు అందుకున్నారు. వరసగా ఒక్కొక్క జోడాయే ముందుకు వచ్చి అందుకుని వెడుతున్నారు. మూర్తి చల్లగా బయటకు జారుకున్నాడు. పెద్దలంతా అయ్యారు.

"ఏమోయ్ మూర్తీ రావోయ్" అని పిల్చిన సుందర రామయ్యకు మూర్తి లోపల ఎక్కడా కనపడలేదు. "అదేమిటోయ్ ముందు పిలవలేదని కోపమా? నువ్వు రాకపోతే మా మేనగోడలు చిన్నబుచ్చుకోదూ?" అని బయటనించి చెయ్యిపుచ్చుకొని లాక్కొచ్చాడాయన మూర్తిని. మూర్తి తాంబూలం పుచ్చుకొని ఎవరికివ్వనా అని ఆలోచిస్తున్నట్లు నటిస్తున్నాడు రేఖ సిగ్గుపడుతోంది మూర్తి ఆతాంబూలం తన చేతిలో పెడ్తాడేమో అన్నట్లుగా. రేఖను, మూర్తిని గమనించిన గిరిజ తన భర్త చేతిలో ఉన్న తాంబూలాన్ని వెంటనే లాక్కుంది.

ఒక్కసారి మూర్తిని, గిరిజను చూసి నిర్ఘాంతపోయింది రేఖ. రామ్మూర్తి గారి శాంతమ్మ, పెళ్ళికొడుకు రఘు ఒకళ్ళ కేసి ఒకళ్ళు తెల్లబోయి చూసుకున్నారు. మూర్తి సుందరరామయ్యగారి అక్కగారి అల్లుడని అంతవరకూ తెలిసికోనందుకు పశ్చాత్తాపపడ్డారు. ★




ఉచితము: పిల్లల సంరక్షణను గురించిన ఉచిత యింగ్లీషు పుస్తకము కావాలని వ్రాయండి. దీనిలో తల్లి తండ్రులకు ఉపయోగపడే విషయములు ఎన్నో ఉన్నాయి.

జాన్సన్ & జాన్సన్
పి.ఓ. బాక్సు 1976, డిపార్టుమెంటు 22 వి.
బొంబాయి